కబ్జా కోరల్లో చెరువులు

- శిఖం భూముల్లో మట్టి పోసి చదును
- పదుల సంఖ్యలో బావులు తవ్వుతున్న వైనం
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు


వీరసముద్రం చెరువు శిఖం ఆక్రమణలో పోసిన మట్టి


చెరువులో మట్టి కోసం తవ్విన పెద్ద గుంత


జివ్వికుంట చెరువు శిఖంలో మట్టి పోసి చదును చేసిన దృశ్యం


జివ్వికుంట చెరువు మధ్యలో తవ్విన బావి

మరిపెడ రూరల్: భూగర్భ జలాలకు చెరువులూ ఆధారం. అలాంటి ఆ చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. చెరువు శిఖం భూములను రాత్రికి రాత్రే దర్జాగా కబ్జా చేసి చదును చేసుకుంటున్నారు. ఆక్రమణల పర్వం చేపట్టి నీటి వనరులను మాయం చేస్తున్నారు. చెరువుల చుట్టు ఉన్న సాగుదారులు ఆక్రమించుకోవడంతో క్రమక్రమంగా హారతి కర్పూరంలా చెరువుల భూములు కరిగిపోతున్నాయి. ఇంత జరుగుతున్న అటు ఇరిగేషన్, ఇటు రెవెన్యూ అధికారుల్లో స్పందన కనిపంచడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వీరారం ఉమ్మడి గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని జివ్వికుంట, వీరసముద్రం, కలిమేకుంట చెరువులు వందలాది విస్తీర్ణం కలిగి ఉన్నాయి. చెరువులు కబ్జాకోరల్లో చిక్కుకుని నానాటికి కుచించిపోతున్నాయి. చివరకు చెరువుల ఉనికే ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

కనుమరుగవుతున్న చెరువులు

చెరువుల చుట్టూ ఉన్న కొందరు ఆక్రమదారులు జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా చెరువు లోతట్టు నుంచి మట్టిని తోడి శిఖం భూముల్లో పోసి చదును చేసుకుంటున్నారు. చదును చేసుకున్న భూమిలోకి చెరువు నీరు చేరకుండా ఉండేందుకు సుమారు మూడు నుంచి నాలుగు ఫీట్ల ఎత్తులో మట్టిపోసుకుంటున్నారు. పెద్దపెద్ద గుంతలు తొవ్వి మట్టిని తీస్తుండడంతో చెరువంతా బొందల గడ్డగా మారుతున్నాయి. పురాతనమైన చెరువులు ఇప్పటికే అధిక శాతం ఆక్రమణలకు గురయ్యాయి. వీరసముద్రం, జివ్వికుంట చెరువులు రోజురోజుకు తరిగిపోతున్న సంబంధిత అధికార యంత్రాంగం ఇటు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువు శిఖంలో బావులు

ఆయా చెరువు పరిధిలో జేసీబీల ద్వారా పెద్ద పెద్ద బావులు తవ్వి సుదూర ప్రాంతాలకు పైపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. వాస్తవానికి చెరువు శిఖంలో భూమిని వానకాలం నాటికి వదిలేసి, యాసంగి పంట సాగు చేసుకునే అవకాశం ఉంది. కానీ ఇదే అదునుగా భావించిన కొందరు ఏకంగా శిఖం భూముల్లో ఎత్తుగా మట్టి పోసి సొంతం చేసుకుంటున్నారు. అదే విధంగా చెరువుల్లో ఇష్టానుసారంగా బావులు తవ్వి వినియోగించుకుంటున్నారు.

చెరువులను కాపాడుకోవాలి



పల్లెకు తల్లిలాంటి చెరువులను కాపాడుకుంటేనే భూగర్భజలాలు నిండుగా ఉంటేనే, ఆ పల్లె పచ్చగా ఉంటుంది. అలాంటిది కొందరు చెరువులను చెరపడుతూ శిఖం కబ్జా చేసుకుంటున్నారు. చెరువు శిఖంలో ఇష్టానుసారంగా బావులు తవ్వుతున్నారు. క్రమక్రమంగా చెరువుల ఆనవాళ్లు లేకుండా బొందల గడ్డలు మిగిలే దుస్థితి నెలకుంది. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు కబ్జాకు గురి కాకుండా చెరువులకు హద్దులు గుర్తించాలి.

– బానోతు లాలు, రైతు, జీన్యతండా, వీరారం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి ద్విచక్రవాహనంపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాచిరాం, పరదీప్ గార్లకు వస్తుండగా ఖమ్మం వెపు వెళ్తున్న దాసరి రాంబాబు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

మున్నేరు బ్రిడ్జి సమీపంలో..

మున్నేరు బ్రిడ్జి సమీపంలో ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఖమ్మంకు చెందిన ఉల్లుట్ల సాయి ఉయ్యాలవాడలో జరిగిన శుభకార్యానికి హాజరైన అనంతరం ద్విచక్రవాహనంపై డోర్నకల్ వస్తుండగా ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడటంతో సాయికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం అందజేత

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో బానోత్ పత్తు ఆదివారం మృతి చెందాడు. దీంతో డోర్నకల్‌కు చెందిన విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మృతుడి కుమారుడు శంకర్‌కు రూ.10వేల చెక్కును అందజేశాడు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



బయ్యారం: మండలంలోని కంబాలపల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి గంధంపల్లి–కొత్తపేటకు చెందిన దేశిని రాంబాబు రూ.50వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్, భాస్కర్, పటేల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఈనెల 20నుంచి 24 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాందాస్ తెలిపారు. ఆదివారం ఎంఈఓ మాట్లాడుతూ.. తరగతి గదిలో బోధన సామర్థ్యాలు, మెళకువలను పెంపొందించడానికి ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్పీలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఎస్‌జీటీలు హాజరుకావాలన్నారు. హాజరుకాకుంటే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

ధైర్యంతో ముందుకు సాగాలి



దంతాలపల్లి: ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ పరికి పండ్ల అశోక్, ప్రముఖ గాయకుడు జయరాజ్ అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన ట్రేడ్ యూనియన్ జాతీయ నాయకుడు బొజ్జ భిక్షం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో నిర్వహించిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, నరేందర్ గౌడ్, సతీష్‌రెడ్డి, జనిగల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ



నెహ్రూసెంటర్: అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారిని నివారించవచ్చని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఎయిడ్స్ వ్యాధితో మరణించిన అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దిశా సీఎస్ఓ సారయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ కుసుమా రమేష్, ఎస్ఎస్‌కే మేనేజర్ బి.రమేష్, పీపీటీసీటీ కౌన్సిలర్ సరస్వతి, జ్యోతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

కొత్తగూడ: కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ చెక్కు దుర్వినియోగంపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. ఎవరికి చెక్కు మంజూరైన వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని, అలాంటి ఆధారాలతో నిరూపిస్తే తమ పార్టీ కార్యకర్తలు అయినా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. ఈ సమావేశంలో చల్ల నారాయణరెడ్డి, మొగిళి, రూప్‌సింగ్, గుమ్మడి సమ్మయ్య, ఈర్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికీ కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, ఇమ్మడి గోవింద్, వెంకటేశ్వర్లు, వీరస్వామి, నాగమణి పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి


కట్ట వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు, గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: అయోధ్య గ్రామ పెద్ద చెరువు కట్ట తెగిపోయిన ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామ మాజీ సర్పంచ్ దుండి శ్రీను డిమాండ్ చేశాడు. మండలంలోని అయోధ్య గ్రామంలో పెద్ద చెరువు కట్ట తెగిపోయిన ప్రాంతం వద్ద ఆదివారం రైతులు, గ్రామస్తులు, మత్స్యకారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దుండి శ్రీను మాట్లాడుతూ.. గత సంవత్సరం భారీ వర్షాలకు అయోధ్య గ్రామ పెద్ద చెరువు కట్ట తెగి దాని కింద ఉన్న వందల ఎకరాల వ్యవసాయ భూములు నీట మునిగి రైతులు, మత్స్యకారులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నాడు. అంతే కాకుండా తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ కూడా నీటి తాకిడికి కొట్టుకుపోయినట్లు తెలిపాడు. కనీసం వంద ఎకరాలకు ఈ చెరువు నీరే దిక్కు అన్నాడు. వెంటనే మరమ్మతులు చేపటాలని, లేని పక్షంలో పెద్దఎత్తున రాస్తారోకోలు చేస్తామన్నాడు. కార్యక్రమంలో గుగులోత్ వినోద్, చెక్కల వేణు, గుణగంటి వెంకన్న, చెక్కల వీరయ్య, పింగిలి వెంకన్న, ఉబ్బపెల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కేసముద్రం: హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతంలో కేసముద్రం మండలం బేరువాడ గ్రామానికి చెందిన గుగులోత్ వినోద్ కుమార్(28) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోత్ వెంకన్న–సరోజ దంపతుల కుమారుడు గుగులోత్ వినోద్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ముషీరాబాద్‌లోని గాంధీనగర్‌లో అద్దె భవనంలో ఉంటున్నాడు. వినోద్ కుమార్ మధ్యాహ్నం నుంచి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి వెంకన్న ఆ ప్రాంతంలోని ఓ యువకుడికి సమాచారం అందించాడు. తన కొడుకుతో మాట్లాడించాలని కోరాడు. దీంతో సదరు వ్యక్తి రూం వద్దకు వెళ్లి చూడగా వినోద్ కుమార్ అప్పటికే మృతి చెందినట్లు కనిపించాడు. వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లి మృతదేహంపై పడి విలపించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రవి

మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, బిల్లులు చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు అన్ని రకాలు బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఐదు డీఏలను ప్రకటించాలని, 30శాతం ఫిట్‌మెంట్ తగ్గకుండా పీఆర్సీని అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో గ్రేడ్–2 భాష పండితుల, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు మురళీకృష, నాయకులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

నెహ్రూసెంటర్: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు గండమల్ల రామయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలు, హక్కులను కాలరాసేలా చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఉన్న 45కోట్ల మంది కార్మికులు జూన్ 9న సమ్మె చేపట్టనున్నారని, దీనిలో భాగంగా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, జక్కుల యాకయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



డోర్నకల్: డోర్నకల్ మండలం రాముకుంటతండా, సీరోలు మండలం మోదుగ్గడ్డతండా సమీప అటవీ ప్రాంతాల్లో ఆదివారం గుడుంబా స్థావరాలపై వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో నిల్వ చేసిన సుమారు 600లీటర్ల బెల్లం పానకం, 600లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి, ఎస్సైలు జి.చంద్రశేఖర్, అశోక్, సిబ్బంది మధు, శ్రీనివాస్, యాదగిరి, రాజు, సుమన్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు


పాతపోస్టాఫీస్ రోడ్డులో తవ్విన గుంతలు

డోర్నకల్: స్థానిక పాతపోస్టాఫీస్ వీధిలో అమృత్ పథకం పైపులైను కోసం రోడ్డు పక్కన గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంరోజుల క్రితం పాతపోస్టాఫీస్ రోడ్డులో డాక్టర్ సత్యనారాయణ ఆస్పత్రి, విజయ రెడిమేడ్ డ్రస్, క్రాంతి ట్రాన్స్‌పోర్ట్, మహావీర్ ఏజెన్సీ దుకాణాల ముందు పైపులైన్ ఏర్పాటు కోసం తవ్వకాలు జరిపి తవ్విన మట్టిని రోడ్డు పక్కన కుప్పలుగా పోశారు. తవ్వకాలు జరుపుతున్న సమయంలో తాగునీటి పైపులు పగలడంతో ఈ ప్రాంతంలోని పలు ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచింది. తవ్వకాలు జరిపి వారం రోజులైనా గుంతలను పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్, మహావీర్ ఏజెన్సీతోపాటు పద్మావతి ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్ ఉండటంతో నిత్యం భారీ వాహనాలు వస్తుండడంతో గుంతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలోని పలు వీధుల్లో పైపులైన్ ఏర్పాటు కోసం తవ్విన గుంతలకు సక్రమంగా పూడ్చకపోవడంతో పూడ్చిన గుంతలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గుంతలలో పగిలిన తాగునీటి సరఫరా పైపులకు మరమ్మతులు చేసి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

రెండోరోజు కొనసాగిన విచారణ


విచారణ చేస్తున్న ఏసీఎస్ఓ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం గ్రామ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవన జ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలపై రెండో రోజు ఆదివారం విచారణ కొనసాగుతుంది. రెండో రోజు విచారణకు అసిస్టెంట్ సివిల్ సప్లయి ఆఫీసర్ (ఏసీఎస్ఓ) రమేశ్ హాజరయ్యారు. ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి స్థానిక రైతులు, సెంటర్ నిర్వాహకుల ద్వారా పలు ధాన్యం కొనుగోళ్లకు చెందిన పలు కీలకమైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అబ్బాయిపాలెం గ్రామంలో సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్ మిల్‌లో విచారణ కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీసీ జానీమియా, ఆపరేటర్ గంగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ శోభ ఉన్నారు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి


కురవి: మంచ్యా తండాలో మృతి చెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న బాధిత మహిళ


బయ్యారం: నారాయణపురంలో..


కురవి: కంచర్లగూడెంలో..

కురవి: విద్యుదాఘాతంతో ఆదివారం రెండు జీవాలు మృత్యువాతకు గురయ్యాయి. శనివారం రాత్రి ఈదురుగాలలతో కూడిన వర్షం పడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కురవి మండలం నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మంచ్యాతండాలో మూడు కిషన్ అనే రైతుకు చెందిన ఎద్దు మేత కోసం బయటకు వెళ్లింది. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుత్ షాక్ వచ్చింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అలాగే మండలంలోని కంచర్లగూడెం గ్రామానికి చెందిన ధరంసోత్ కిషన్‌నాయక్ అనే రైతుకు చెందిన ఎద్దు మేత కోసం బయటకు వెళ్లింది. మొగిలిచర్ల శివారులోని మామిడి తోటలో విద్యుత్ వైర్లు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని రైతు ఆవేదనతో తెలిపారు.

విద్యుదాఘాతంతోపాడి గేదె..

బయ్యారం: విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నారాయణపురంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్టెబోయిన మల్లయ్యకు చెందిన పాడి గేదె మేతకు వెళ్లి పొలాల్లో కిందపడిన విద్యుత్ తీగకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతు అధికారులను వేడుకుంటున్నాడు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఆత్మ మరిపెడ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకకు వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో రఘువీర్ రెడ్డి, నూకల అభినందన రెడ్డి, నూకల అభినవ్ రెడ్డి, కామ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ పక్షాన ఉండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని కంఠాయపాలెంలో మృతుల కుటుంబ సభ్యులైనా మాజీ ఎంపీటీసీ పల్లె దేవమ్మ, తొర్రూరులో మాజీ ఎంపీటీసీ మంగళపెల్లి ఆశయ్యలను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపెల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, రామిని శ్రీను, నలమాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో భక్తుల సందడి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆలయ వార్షికోత్సవం

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ దంపతులు నున్నా రమణ, భారతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బొడ్రాయి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని సికింద్రాబాద్ తండ గ్రామంలో మూడో సంవత్సరం బొడ్రాయి ప్రతిష్ఠ పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయి తల్లికి అభిషేకాలు నిర్వహించి, పూజలు చేసి, బోనంతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ సన్నిధిలో పూజలు చేసి, పోతురాజు వద్ద యాటపోతుల మొక్కులతో గ్రామ దేవత, హనుమాన్ స్వామి గ్రామస్తులను చల్లగా చూడాలని వేడుకున్నారు. మాజీ సర్పంచ్ నూనావత్ ఇస్తారి, తండాపెద్దలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తొర్రూరు రూరల్: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అంబులెన్స్‌నే బిడ్డకు ఆదివారం జన్మనించింది. మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన గర్భిణి ప్రత్యూషకు అకస్మాత్తుగా నొప్పులు రావడంతో 108 అంబెలెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆమెను వాహనంలో తీసుకెళ్తుండగా మర్గమధ్యలో సిబ్బంది కాన్పు చేశారు. సిబ్బంది మనీష, వనజ, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గంగారం: ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి జరిగిన ప్రమాదంతో యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని మడగూడెం శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన జాడి వేణుగోపాల్ (25) గంగారం మండలంలోని కోమట్లగూడెంలోని తన సోదరి మమత ఇంటికి సాయంత్రం వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మడగూడెం క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడి భార్య గర్భిణి. కుటుంబీకుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని తక్షణశీల హైస్కూల్‌లో 2004–05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు దామోదర్‌రెడ్డి, దార ఐలయ్య, బిల్లా మల్లారెడ్డి, పాక కృష్ణ, సాబీర్, గోవర్ధన్, విష్ణు, రాంచందర్, లక్ష్మి, పూర్వ విద్యార్థులు డాక్టర్ రాజ్‌కుమార్, రమేష్‌బాబు, సంతోష్, శ్రీధర్, అక్రం, కృష్ణవేణి, దీప్తి, కవిత, జ్యోతి పాల్గొన్నారు.